
సాక్షి
కాకినాడ
గురువారం । 3 । ఆగస్టు । 2023



అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన పథకానికి శిఖా శ్రీనివాసరావు దంపతులు (అమలాపురం) రూ.50,116 అందజేశారు.



డెల్టాకు నీరు విడుదల

ధవళేశ్వరం: ఖరీఫ్ సాగులో భాగంగా బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 4,500,మధ్య డెల్టాకు 2,000,పశ్చిమ డెల్టాకు 4,860 క్యూసెక్కులు వదిలారు.

ఆటలకూ పెద్ద పీట



రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న అంశం అందరికీ తెలిసిందే. పాఠశాలలను అభివృద్ధి చేయడమే కాకుండా, గుణాత్మక విద్యను అందించేందుకు వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోంది. తాజాగా ఆటలకు పెద్దపీట వేస్తోంది - 8లో▸

న్యూస్‌రీల్

సత్యదేవుని ఆలయం వద్ద మెట్ల విస్తరణ



సత్యదేవుని ఆలయం వద్ద ఎడమ వైపు రెండు అడుగుల మేర విస్తరించిన మెట్లు

అన్నవరం: రత్నగిరిపై వీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి ఇరువైపులా ఉన్న మెట్లను విశాలం చేశారు. స్వామివారి ఆలయానికి ఇరువైపులా గతంలో మూడు అడుగుల వెడల్పున మాత్రమే మెట్లు ఉండేవి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ మెట్ల ద్వారా రాకపోకలకు భక్తులు ఇబ్బంది పడేవారు. ఒకరి వెనుక ఒకరు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. స్వామివారి దర్శనానికి, దర్శనం అనంతరం దిగువకు వచ్చేటప్పుడు ఆలస్యమయ్యేది. సమస్యను గుర్తించిన అధికారులు ఈ మెట్లను మరో రెండు అడుగులు మేర విస్తరించాలని గతంలో భావించినా కార్యరూపం దాల్చలేదు. దేవస్థానం ఈఓగా చంద్రశేఖర్ అజాద్ వచ్చాక ఈ పనులు చేపట్టి పూర్తి చేశారు. ప్రస్తుతం భక్తులు మెట్ల మీద రెండు వరుసల్లో రాకపోకలు సాగిస్తున్నారు. మెట్లు చాలా సౌకర్యవంతంగా ఉండడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా మెట్లకు ఒక వైపు మాత్రమే పట్టుకుని దిగేలా ఐరన్ రాడ్ సపోర్ట్ ఏర్పాటు చేశారు. రెండో వైపు కూడా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

కాకినాడ వెళ్లి పింఛను అందజేత



కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో యాసమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ రామకృష్ణ

గోకవరం: గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామానికి చెందిన ఓ వలంటీర్ సొంత ఖర్చులతో కాకినాడ వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకి పింఛను అందజేశాడు. వివరాల్లోకి వెళితే.. కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని కొత్తూరుకు చెందిన చట్టాడ యాసమ్మ ఇటీవల ఓ వివాదంలో గాయపడి కొద్ది రోజులుగా కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పింఛను లబ్ధిదారు కావడంతో గ్రామ వలంటీర్ బోడపాటి రామకృష్ణ బుధవారం సొంత ఖర్చులతో కాకినాడ వెళ్లి పింఛను అందజేశాడు. వలంటీర్ రామకృష్ణను ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రశంసించారు.

ప్రశాంతంగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ: ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఈనెల వరకూ 7 వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. తొలిరోజు పరీక్షలకు ఉదయం 563 మందికి 482 మంది, మధ్యాహ్నం పరీక్షకు 325 మందికి 297 మంది హాజరయ్యారన్నారు.

సామర్లకోటలో ఆహాల్ట్

- వందేభారత్‌కు సామర్లకోటలో హాల్ట్‌కు గ్రీన్ సిగ్నల్
- నేటి నుంచి ఒక నిమిషం ఆగనున్న రైలు
- ఇన్నాళ్లూ రాజమహేంద్రవరంలోనే హాల్టు
- ఎంపీ కృషితో నెరవేరిన ప్రయాణికుల కోరిక



వందేభారత్ రైలు

సాక్షిప్రతినిధి,కాకినాడ: రైళ్లలో తాజాగా వందే భారత్‌కున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఈ రైలు ఎక్కేందుకు ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. టికెట్ ఖరీదెక్కువైనా సమయం కలిసి వస్తుండటంతో ఎగువ మధ్య తరగతి వర్గాలు తగ్గేదే లేదంటూ జై వందే భారత్ అంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో మాత్రమే ఇప్పటివరకూ ఈ ట్రైన్ ఆగుతుంది. కాకినాడ జిల్లాలో రైల్వేపరంగా కీలకమైన సామర్లకోట జంక్షన్‌లో దాదాపు చాలా సూపర్ ఫాస్ట్ రైళ్లు ఆగుతున్నా వందేభారత్ మాత్రం ఆగదు. ఇక్కడ హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు ఆవేదన చెందేవారు. గురువారం నుంచి వీరి వేదన తొలగిపోనుంది. సామర్లకోట రైల్వే జంక్షన్‌లో హాల్టుకు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ ప్రాంతానికి చెందిన వారిలో ఆనందోత్సాహం వ్యక్తమవుతోంది. గురువారం తొలిసారి ఆగనున్న సందర్భంగా వందేభారత్‌కు ఘనంగా స్వాగతించేందుకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. సికింద్రాబాద్-విశాఖపట్నం నుంచి బయలుదేరే ఈ రైలు స్టేషన్‌లో ఒక నిమిషం ఆగుతుంది. ఇప్పడి వరకు రాజమహేంద్రవరానికి రెండు గంటలు వ్యయప్రయాసలు పడి అటు కోనసీమ, ఇటు కాకినాడ జిల్లాల ప్రయాణికులు రైలు ఎక్కుతున్నారు.

ఆరంభం నుంచి డిమాండ్

ప్రారంభం నుంచి వందే భారత్‌కు సామర్లకోట జంక్షన్‌లో హాల్ట్ కావాలని ప్రయాణికులు కోరుతున్నారు. విశాఖపట్నం-విజయవాడ మధ్య నడిచే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణీకులు కాకినాడకు వెళ్లాలంటే సామర్లకోట జంక్షన్‌లో రైలు దిగాలి. మెట్ట ప్రాంత మండలాల నుంచి సామర్లకోట వచ్చి విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం, శ్రీకాకుళం వైపు ప్రయాణిస్తుంటారు. ఈ ప్రాంత ప్రయాణీకులతో పాటు మైదాన ప్రాంతంలోని కాకినాడ, తుని, పిఠాపురం పట్టణ ప్రయాణికులు కూడా సామర్లకోటలో హాల్ట్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ప్రాంత మనోభావాలను ఎంపీ వంగా గీత కేంద్ర రైల్వేశాఖమంత్రి అశ్విన్‌వైష్ణవ్ దృష్టికి తీసుకు వెళ్లారు. మంత్రి సానుకూల స్పందన ఫలితంగా రైల్వేబోర్డు హాల్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 48 గంటల వ్యవధిలోనే ఆమోదం లభించడంతో ప్రయాణీకుల సంతోషపడుతున్నారు.

వందేభారత్ (20833) వేళలు ఇలా

- ఈ రైలు విశాఖ నుంచి సామర్లకోటకు ఉదయం 7-14గంటలకు చేరుకుంటుంది. 7-15 గంటలకు తిరిగి బయలుదేరి మధ్యాహ్నం 2-15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- సికింద్రాబాద్ నుంచి 20834 నంబర్‌తో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రాత్రి 9-34 గంటలకు సామర్లకోట చేరుకుంటుంది. నిమిషం తర్వాత తిరిగి బయలుదేరి విశాఖ వెళుతుంది.



ఆ లోటు భర్తీ అయ్యేనా

సామర్లకోట రైల్వే జంక్షన్ నుంచి విశాఖపట్నం, విజయవాడ మీదుగా రోజుకు 80 (అప్ అండ్ డౌన్) ఎక్స్‌ప్రెస్‌రైళ్ళు రాక పోకలు సాగిస్తున్నాయి. వీటిలో 50 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లే కావడం విశేషం. మిగిలినవి ఎక్స్‌ప్రెస్ రైళ్లు. రోజూ ఈ జంక్షన్ నుంచి ఏడెనిమిది వేల మంది ప్రయాణిస్తున్నారని రైల్వే అంచనా. ప్రస్తుతం వందేభారత్ రైలులో ఉమ్మడి జిల్లా నుంచి రోజూ 350 మంది ప్రయాణిస్తున్నారు. అయినా రైలులో సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. సామర్లకోట జంక్షన్‌లో హాల్ట్‌కు గ్రీన్ సిగ్నల్ లభించడంతో ఆ లోటు భర్తీ అవుతుందని రైల్వే అధికారులు విశ్వసిస్తున్నారు. ఇకపై రాజమహేంద్రవరం వెళ్లాల్సిన అవసరం లేకుండానే సామర్లకోట హాల్ట్‌తో తమకు వందేభారత్ అందుబాటులోకి వస్తోందని కాకినాడ జిల్లా ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణ సమయం గంట నుంచి రెండు గంటలు తగ్గుతుందని ఆసక్తి చూపుతున్నారు.

హాల్ట్‌కు సర్వం సిద్ధం



వందేభారత్ హాల్ట్ సామర్లకోట జంక్షన్‌కు ఇవ్వడంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇక్కడ ఆగేది ఒక్క నిమిషమే. ఈ సమయాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలి. సామర్లకోటలో హాల్ట్‌కు ఆమోదం లభించడంతో ఇప్పటికే హాల్ట్ ఉన్న రైల్వే స్టేషన్‌లలో ప్రయాణ సమయాల మార్పును ప్రయాణీకులు గమనించాలి.

– ఎమ్ రమేష్, స్టేషన్ మేనేజర్.సామర్లకోట.

భక్తులకు అక్కడ విశ్రాంతి బస

- త్వరలో కనుమరుగు కానున్న శ్రీసత్యదేవ అతిథిగృహం
- శిథిలావస్థకు చేరిందని నిపుణుల నివేదిక
- కూల్చివేసి విశ్రాంతి షెడ్డు నిర్మించాలని నిర్ణయం



సత్యదేవుని పశ్చిమ రాజగోపురం ఎదురుగా గల సత్యదేవ గెస్ట్‌హౌస్

అన్నవరం: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పశ్చిమ రాజగోపురం ఎదురుగా ఉన్న 30 వీఐపీ సత్రం (శ్రీసత్యదేవ గెస్ట్‌హౌస్) త్వరలో కనుమరుగు కానుంది. సత్రం శిథిలావస్థకు చేరిందని నిపుణుల కమిటీ నివేదిక ఇవ్వడంతో ఈ సత్రాన్ని కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు. గత నెల 28న దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో త్వరలోనే ఈ సత్రాన్ని కూల్చివేసి స్థలాన్ని చదును చేసి ఇచ్చేందుకు టెండర్ పిలవనున్నారు. సుమారు ఎకరం స్థలంలో ఉన్న ఈ సత్రంలో ప్రస్తుతం 60 గదులున్నాయి. రూ.400కు గదులును అద్దె కిస్తున్నారు. ఆలయానికి చాలా దగ్గరగా ఉండడంతో ఎక్కువ మంది ఈ సత్రంలోనే బస చేయడానికి ఆసక్తి చూపుతారు.

30 వీఐపీ సత్రంగా ప్రసిద్ధి చెందిన అతిథిగృహం

దేవస్థానంలో ఆధునిక వసతులతో సత్రాలు లేని రోజులైన 1985లో శ్రీసత్యదేవ అతిథిగృహం పేరుతో 30 గదుల సత్రం నిర్మాణం ప్రారంభించారు. 1987లో నిర్మాణం పూర్తి చేశారు. కాలక్రమేణా ఇది 30 వీఐపీ సత్రంగా ఇది ప్రసిద్ధి చెందింది. సత్రం ప్రారంభించాక 1988లో 30 గదులతో మొదటి అంతస్తు కూడా నిర్మించారు. అప్పటి నుంచి ఇందులో 60 గదులు భక్తులకు అందుబాటులోకి వచ్చాయి.

కూల్చివేతకు కారణాలివే..

సత్యదేవుని ఆలయానికి భక్తులు ఎక్కువగా పశ్చిమ రాజగోపురం మార్గం ద్వారానే వస్తున్నారు. కార్తికమాసం, ఇతర పర్వదినాల్లో అక్కడ రద్దీ ఏర్పడుతోంది. గతేడాది కార్తిక ఏకాదశి నాడు భక్తుల రద్దీని తట్టుకోలేక పశ్చిమ రాజగోపురం తలుపులు మూసి వేసి సుమారు గంట సేపు భక్తులను లోపలకి అనుమతించలేదు. దాంతో భక్తులు పశ్చిమ రాజగోపురం నుంచి ఘాట్‌రోడ్ వరకు నిలిచి పోయారు. అంతేకాకుండా భక్తులకు వసతి గదులు లభించక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పశ్చిమరాజగోపురం ఎదురుగా గల 30 వీఐపీ సత్రం కూల్చి వేస్తే సుమారు ఎకరం స్థలం లభిస్తుంది. వసతి గదులు దొరకని భక్తుల కోసం అక్కడ విశాలమైన విశ్రాంతి షెడ్డు, దాని పక్కన టాయిలెట్స్ నిర్మించాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు.

సత్రం కూల్చివేసి విశ్రాంతి షెడ్డు నిర్మిస్తాం



ప్రస్తుతం 30 వీఐపీ సత్రం శిథిలావస్థకు చేరిందని నిపుణులు నివేదిక ఇచ్చారు. దీనికి తోడు ఈ సత్రంలోని 60 గదుల్లో 60 మందికి మాత్రమే వసతి కల్పిస్తున్నాం. ఈ సత్రం కూల్చి వేసి ఆ స్థలంలో విశాలమైన విశ్రాంతి షెడ్డు, దాని వెనుక టాయిలెట్స్ నిర్మిస్తే సుమారు రెండు వేల మంది భక్తులకు వసతి కల్పించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఈ స్థలంలో రాజగోపురానికి ఎదురుగా వ్రతాలు, స్పెషల్ దర్శనం టిక్కెట్ల కౌంటర్లు, ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేస్తాం. పండ్ల దుకాణం, ఫ్యాన్సీ షాపు, మినీ క్యాంటీన్ కూడా ఏర్పాటు చేస్తాం. పర్వదినాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తాం.

– చంద్రశేఖర్ అజాద్, ఈఓ, రత్నగిరి

'ప్రసాద్' స్కీం నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన ఎంపీ వంగా గీత



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ఎంపీ గీత

అన్నవరం: అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ప్రసాద్ (పిలిగ్రిమైజ్ రీజువినేషన్ అండ్ స్ప్రిట్యువల్ అగమెంటేషన్) స్కీం కింద వివిధ నిర్మాణాల ప్రారంభానికి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఎంపీ వంగా గీత కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి కోరినట్టు ఎంపీ వంగా గీత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రసాద్ స్కీంకు దేవస్థానాన్ని ఎంపిక చేసి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు పరిపాలన అనుమతి రాలేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. గతేడాది అక్టోబర్ 17న న్యూ ఢిల్లీలో జరిగిన ప్రసాద్ స్కీం సెంట్రల్ శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో అన్నవరం దేవస్థానానికి రూ.రూ.54.17 కోట్లు ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారన్నారు. ఆ మేరకు తుది డీపీఆర్‌ను పర్యాటక శాఖ కేంద్రప్రభుత్వానికి సమర్పించిందని తెలిపారు. ఈ నిధులతో దేవస్థానంలో అన్నదాన భవనం, వ్రతమండపాలు తదితర నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు నిర్మాణాలు ప్రారంభించేందుకు నిధులు మంజూరు చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరినట్టు ఎంపీ గీత తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని ఆమె వివరించారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏప్లస్ ప్లస్ గుర్తింపు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదిత్య డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు కల్పించింది. ఈ మేరకు న్యాక్ కార్యాలయం (బెంగళూరు) కళాశాలకు బుధవారం సమాచారం తెలిపింది. న్యాక్ కమిటీ బృందం గత నెల 26,27తేదీల్లో కళాశాలలో పర్యటించింది. విద్యావిధానాలు,వనరులు,వసతులు తదితర అంశాలను పరిశీలించించింది. 3.66 స్కోర్‌తో గుర్తింపునిస్తూ ప్రకటన సమాచారం పంపింది..2016లో న్యాక్ కమిటీ సందర్శించి న్యాక్ బీ ప్లస్ ప్లస్ హోదా కల్పించింది. తాజాగా ఇప్పుడు ఏప్లస్ ప్లస్ కల్పించింది. ఈ గుర్తింపు ఐదేళ్లపాటు ఉంటుంది. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి,అకడమిక్ డైరెక్టర్ బీఇవీఎల్ నాయుడు,విద్యాసంస్థల కార్యదర్శి కృష్ణదీపక్ రెడ్డి,సుగుణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

జగనన్న పాల వెల్లువకు సిద్ధం

పశు సంవర్ధక జేడీ సూర్యప్రకాశరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అమూల్ డెయిరీకి పాల సేకరణలో భాగంగా జగనన్న పాల వెల్లువకు సిద్ధం చేస్తున్నట్టు జిల్లా పశువైద్యాధికారి ఎస్.సూర్యప్రకాశరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులను నియమించి కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తొలి దశలో జిల్లా ఎనిమిది మండలాల్లో (తుని, కోట నందూరు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి, గొల్లప్రోలు, ఉప్పాడ కొత్తపల్లి, పిఠాపురం) 96 గ్రామాల్లో అమూల్ డెయిరీకి పాలు సేకరించే దిశగా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో పాల సేకరణకు ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల ఏర్పాటుకు భవనాలను ఎంపిక చేశామని, పాల సేకరణకు కావలసిన యంత్రాలు, పరికరాలను గుజరాత్ నుంచి దిగుమతి చేశామన్నారు. సంబంధిత ప్రమోటర్లకు పాలలో కొవ్వు శాతం ఎలా చుడాలి అనే దాని పై అవగాహన కల్పించి ప్రతి గ్రామంలో రోజుకు 160 లీటర్ల పాలు సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల నుంచి పాలు తుని మండలం రేఖవానిపాలెం గ్రామంలో మిల్క్ చిల్లింగ్ యూనిట్‌కు తరలించనున్నట్టు తెలిపారు. ప్రతి పది రోజులకు ఒకసారి సంబంధిత బ్యాంకు ఖాతాకు కొవ్వుశాతం ఆధారంగా సొమ్ము చెల్లిస్తామన్నారు.

ఇంటింటా సంపూర్ణ పోషణ

- గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలి
- జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు



వైఎస్సార్ సంపూర్ణ కిట్ అందజేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్. చిత్రంలో జేసీ ఇలక్కియా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ-ఇంటికే రేషన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ వివేకానందహాల్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విప్పర్తి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం జగన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు.

గర్భిణులు, బాలింతల సమస్యలు గుర్తించి : జేసీ ఇలక్కియ

కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పోషకాహారం తీసుకునేందుకు ఇబ్బంది అవుతోందని లబ్ధిదారులు చెప్పున్నారని, దీంతో సర్వే చేసి జిల్లాలో 11,064 మంది గర్భిణులు, 9,108 మంది బాలింతలు ఉన్నట్లు గుర్తించి పోషణ కిట్లను వారి ఇళ్లకే పంపే ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. జిల్లా పరిధిలోని తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టులకు సంబంధించి 1,986 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఆమె తెలిపారు. గర్భిణులు ఫ్యామిలీ ఫిజీషియన్‌ను సద్వినియోగం చేసుకుని రెగ్యులర్ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు టి.ఆదిలక్ష్మి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కాకినాడ పట్టణ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, కాకినాడ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కె.ప్రవీణ, జిల్లా శిశు సంరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ డి.పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డీఎస్‌వో ఎంవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వారధిక్యం

- నిర్మించి చాలాకాలం కావడంతో రైలు కం రోడ్డు వంతెనకు ఇబ్బందులు
- వాహనాల రద్దీతో ఏర్పడుతున్న ప్రమాదం
- భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం
- భారీ వాహనాల నిషేధానికి గట్టి చర్యలు
- రూ.36 కోట్లతో మరమ్మతులకు ప్రతిపాదనలు



కొవ్వూరు-రాజమహేంద్రవరం రోడ్డు రైలు వంతెన

కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి దాటి అవతలి వైపునకు వెళ్లాలంటే పడవో, పంటో ఎక్కాల్సిందే. మరో దారి లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతూ కొవ్వూరు వెళ్లేవారు. కొవ్వూరు నుంచి తిరిగి రావాలన్నా మళ్లీ అదే మార్గం ..అదే కష్టం..1976 నుంచి ఈ ఇబ్బందులు తప్పాయి. ఉభయ గోదావరి జిల్లాలను (విభజనకు ముందు) కలుపుతూ అఖండ గోదావరిపై రోడ్డు కం రైలు వంతెన ప్రారంభమైంది. కింది మార్గంలో రైలు వెళ్లేందుకు పట్టాలు.. దానిపైన రోడ్డు నిర్మించారు. అపురూపమైన ఈ రవాణా సౌకర్యం అందరినీ ఆనందాశ్చర్యాల్లో ముంచెత్తింది. గోదారమ్మ సాక్షిగా బస్సులోనో..రైలులోనో గమ్యం చేరే మధురానుభూతుల ప్రయాణానికి మార్గం ఏర్పడింది. మనదేశంలో రెండో అతిపెద్ద రోడ్డు కం రైలు ప్రయాణ వారధి ఇదే. 49 ఏళ్ల ఈ చారిత్రాత్మక వంతెన నాణ్యత పరిరక్షణ ఇప్పుడు సవాలుగా నిలిచింది. వయో భారం పెరగడంతో ఎక్కువ వాహనాలను ఈ వంతెనపై అనుమతించాలాంటే సందేహించాల్సి వస్తోంది. అందుకే ముందు జాగ్రత్తగా భారీ వాహనాలను అనుమతించకూడదని అధికారులు తాజాగా నిర్ణయించారు.

నిర్మాణం ఇలా..

గోదారమ్మ వడ్డాణం ధరించిందా అన్నట్టుటుంది రైలు కం రోడ్డు వంతెన. ఈ వంతెనపై ప్రయాణమంటే ఇష్టం లేని వారే ఉండరు. ఇప్పటికీ బస్సు లేదా రైలులో ప్రయాణిస్తున్నప్పుడు రాజమహేంద్రవరం వస్తుందనగానే అందరి కళ్లు ఉరకలేసే గోదారిని చూడాలని ఆరాటపడతాయి. ఆనందానుభూతులను మనసులో నింపుకొంటారు. చెన్నై-హౌరా మధ్య రైల్వే లైన్‌ను డబ్లింగ్ చేయాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు ఈ వారధి నిర్మాణం తెరపైకి వచ్చింది. 1964లో ప్రారంభమైన నిర్మాణ పనులు పూర్తి చేయడానికి ఒక దశాబ్దం పట్టింది. జపాన్‌లో కన్‌సాయి అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద 1994లో 3.7 కిలోమీటర్ల పొడవున నిర్మించిన స్కైగేట్ బ్రిడ్జి తర్వాత పెద్ద వంతెన ఇదే కావడం విశేషం. అత్యాధునిక టెక్నాలజీని వినియోగించి మూడు జాతీయ సంస్థలు ఈ వంతెన నిర్మాణంలో పాలు పంచుకున్నాయి. 1974 నవంబర్ 20 అప్పటి రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ దీనిని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అరవై ఐదేళ్లు కనిష్టం, ఎనభై ఏళ్లు గరిష్టంగా మనగలిగేలా వారధిని నిర్మించారు. అప్పటి నుంచి ఈ వారధి ఉభయ గోదావరి సమైక్య వాహినిగా ఖ్యాతినార్జించింది.

రూ.36 కోట్లతో మరమ్మతులు

ఈ వంతెనపై 1996 నుంచి ఇప్పటివరకూ అడపాదడపా మరమ్మతు పనులు చేపడుతున్నారు. కానీ అవి నిలవడం లేదు. ఇటీవల ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ వంతెన మార్గానికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రూ.36 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. రూ.24 కోట్ల వ్యయంతో గడ్డర్ల మార్పిడి, ఫుట్‌పాత్ నిర్మాణం, శ్లాబులు వేయడం, హ్యాండ్ రైలింగ్ వంటి పనులు ఇందులో చేపడతారు. ఈ మొత్తంలో రూ.3 కోట్లు మాత్రమే రైల్వే శాఖ వాటాగా భరించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తంతో జాయింట్ల మరమ్మతులు, రోడ్డు నిర్మాణం, సెకండరీ జాయింట్ మరమ్మతులు, లైటింగ్ ఏర్పాటు, క్రోకడయిల్ జాయింట్ మరమ్మతులు చేపట్టాలని సంకల్పించారు. అత్యవసరంగా రూ.2.10 కోట్ల వ్యయంతో వారధికి ప్రత్యేక మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. అప్రోచ్ రోడ్లను కూడా పునరుద్ధరించనున్నారు. ఈ పనులకు టెండర్లు పిలిచారు.

ఇప్పుడేమైంది..

నిర్మాణ సమయంలో అనుకున్న అంచనాలకు మించి తర్వాత ఈ వారధిపై రాకపోకలు జరుగుతున్నాయి. రోజుకు 25 వేల నుంచి 30 వేల వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయని అంచనా. రవాణా అవసరాలు పెరిగిపోవడంతో రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య భారీగా పెరిగిపోయింది. సరకు రవాణాకూ ఈ మార్గాన్నే అనుసరించేవి. ఫలితంగా వాహనాల రద్దీ భారీగా పెరిగింది. వారధికి భారంగా పరిణమించింది. దీంతో 49 ఏళ్లకే వంతెన మార్గం ప్రమాదంలో పడింది. 2007, 2011లలో దీనిని నిపుణులు పరిశీలించారు. మూడు ఆక్సిల్స్ అంతకంటే ఎక్కువ ఉన్న వాహనాలు, లేదా 10.20 టన్నుల బరువుకు మించిన వాహనాలు ఈ మార్గంలో వెళ్లడం సరికాదని సూచించారు. దీంతో అధికారులు వంతెన భద్రతను దృష్టిలో పెట్టుకుని భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు.

నిర్లక్ష్యానికి మూల్యం

క్షేత్ర స్థాయిలో వంతెనపై భారీ వాహనాకు సంబంధించిన రూపొందించిన నిషేధాజ్ఞలు సక్రమంగా అమలు కాలేదు. 2010లో రాజమహేంద్రవరం ట్రాఫిక్ పోలీసుల ఉదాసీన వైఖరిని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. ఎస్సైతో పాటు దిగువ స్థాయిలోని కొంతమంది సిబ్బందిని అప్పట్లో సస్పెండ్ చేశారు. తర్వాత నిబంధనల అమలుకు వంతెన మార్గానికి అటు ఇటు పోలీసులు పికెట్లు ఏర్పాటు చేశారు. తర్వాత సిబ్బంది కొరత కారణంగా ఎత్తివేశారు. దీంతో భారీ వాహనాల నియంత్రణపై పర్యవేక్షణ కొరవడింది. అధికారులు ఇటీవల వంతెన భద్రతను దృష్టిలో పెట్టుకుని మళ్లీ ఇరువైపులా నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. ఈ ఏడాది జూలై 23 నుంచి భారీ వాహనాల నియంత్రణపై కలెక్టర్ మాధవీలత గట్టి ఆంక్షలు విధించారు. రెండు వైపులా పోలీసు పికెట్లను పునరుద్ధరించారు. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వంటివి మాత్రమే అనుమతిస్తున్నారు. సామాన్య ప్రజలకు అసౌకర్యం కలగకుండా పల్లెవెలుగు బస్సులను అనుమతిస్తున్నారు.

శాశ్వత పనులకు ప్రతిపాదనలు



రోడ్డు కం రైలు వంతెనపై శాశ్వత మరమ్మతులను ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రత్యేక పనుల కింద రూ.2.10 కోట్లతో అత్యవసరంగా చేపట్టేందుకు టెండర్లు పిలిచాం. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం. అత్యవసర నిధులతో వివిధ రకాల పనులు చేపట్టనున్నాం. శాశ్వత మరమ్మతులు చేపట్టడానికి రైల్వే శాఖను సమన్వయ పరుచుకోవాల్సి ఉంది.

– ఎస్‌టీవీ రెడ్డి, ఈఈ, రోడ్డు కం రైలు వంతెన, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మండపేట: పట్టణంలోని వీరభద్రపురం వద్ద రామచంద్రపురం రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. కాకినాడ శివారు తూరంగికి చెందిన కె.నాగరాజు (36) కాళ్లు, చేతులు విరిగిన వారికి తాపేశ్వరంలో పసరు కట్టు కడుతుంటాడు. మంగళవారం రాత్రి పని ముగించుకుని మోటారు సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా వీరభద్రపురం వద్ద ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో మృతిచెందాడు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోం గార్డు ఆత్మహత్య

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం పేరూరు శివారు విశ్వేశ్వర అగ్రహారానికి చెందిన హోంగార్డు కుడుపూడి వెంకట శ్రీనివాసరావు (46) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. అప్పుల పాలై వెంకట శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్సై జి.హరీష్‌కుమార్ తెలిపారు. తన ఇంటికి సమీపంలోని జమిందారిగారి తోటలో హోంగార్డు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అతని భార్య దీప్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వీరికి ఏకైక కుమారుడు ఉన్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు.

గోదావరిలో జారి పడి మృతి

కొత్తపేట: ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి గోదావరిలో జారిపడి మృతి చెందినట్టు ఎస్సై వి.మణికుమార్ తెలిపారు. మండల పరిధిలోని బిళ్లకుర్రు శివారు మాసాయిపేటకు చెందిన బీర దిలీప్‌కుమార్ (38), శ్రీనివాస్ అనే వ్యక్తితో కలిసి బుధవారం వానపల్లి సమీపంలోని అద్దంకివారిలంక వెళ్లాడు. తిరిగి వస్తూ గోదావరిలో కాళ్లు కడుక్కుంటూ ప్రమాదవశాత్తు జారి గల్లంతయ్యాడు. వెంట వెళ్లిన శ్రీనివాస్ దిలీప్ కుటుంబ సభ్యులను సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం లభ్యం కాగా కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని సోదరుడు సంజీవయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటలకూ పెద్ద పీట

- నరదాగా..సందడిగా..'ఆడుదాం ఆంధ్ర'
- సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా సంబరాలు
- విజేతలకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతులు
- జిల్లాలో 515 సచివాలయాల పరిధిలో ఏర్పాట్లు


క్రీడా పోటీలు (ఫైల్)

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న అంశం అందరికీ తెలిసిందే. పాఠశాలలను మనబడి నాడు–నేడు పేరుతో అభివృద్ధి చేయడమే కాకుండా, విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోంది. లెర్న్ ఏ వర్డ్ ఏ డే, తర్ల్, టీచింగ్ టూల్, డిజిటల్ ఎడ్యుకేషన్, ప్రతీ విద్యార్థికి ఆంగ్ల విద్య, ప్రాథమిక స్థాయి నుంచే 'టోఫెల్' తదితర వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. విద్యలో సంక్షేమ కార్యక్రమాలతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పుడు యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు కూడా అంతే ప్రాధాన్యతను ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పుడు 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ఆటలపోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున ప్రారంభం కానున్న క్రీడా పోటీలకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని 515 సచివాలయాల పరిధిలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 46 రోజుల పాటు నిర్వహించే క్రీడా సంబరాల్లో యువతను పెద్ద ఎత్తున ప్రోత్సహించనున్నారు.

యువతను ప్రోత్సహించేందుకు..

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌ను భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు యువతను ప్రోత్సహించడం, జీవన నాణ్యతను మెరుగుపర్చడానికి గల మార్గాలపై అవగాహన కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలను నిర్వహిస్తారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటల పోటీలను నిర్వహిస్తారు. నాన్ కాంపిటేటివ్‌లో భాగంగా యోగ, టెన్నికాయిట్, మారథాన్, ఆయా గ్రామాల్లోని సంప్రదాయ క్రీడల్లో కూడా పోటీలు నిర్వహిస్తారు. స్టేట్ అథ్లెటిక్ ఫెడరేషన్(శాప్) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో రూ.44.52 కోట్లను మంజూరు చేసింది.

పోటీల నిర్వహణకు కమిటీలు

పోటీల నిర్వహణకు వివిధ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామ/సచివాలయ స్థాయిలో పోటీల నిర్వహణకు తహసీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో, పంచాయతీ విస్తరణాధికారి, ఏఈ/డీఈ, పంచాయతీ కార్యదర్శి, క్రీడా పోటీలు నిర్వహించే హెచ్ఎంతో గ్రామ/సచివాలయ, మండల, నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేస్తారు. జిల్లా స్థాయిలో డీఈవో, డీఆర్‌డీఏ పీడీ, యువజన సర్వీసుల సీఈవో, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి, జెడ్పీ సీఈవో తదితర అధికారులతో జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తారు. ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌లో నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రైజ్‌మనీ అందజేస్తారు.

గ్రామ/వార్డు స్థాయి నుంచి..

పోటీలను ముందుగా గ్రామ, పట్టణాల్లోని వార్డు స్థాయి నుంచి నిర్వహిస్తారు. తర్వాత మండల/పట్టణ, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విజేతలకు క్రీడా పరికరాలు, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు. వాలీబాల్ జట్టులో ఆరు నుంచి 12, కబడ్డీ జట్టులో 7 నుంచి 12 మంది, ఖోఖో జట్టులో 9 నుంచి 12, క్రికెట్ జట్టులో 11 నుంచి 16, బాడ్మింటన్ జట్టులో ఇద్దరు వంతున క్రీడాకారులు ఉంటారు.

విజేతలకు నగదు బహుమతులు

పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ విజేతలకు నియోజకవర్గ స్థాయిలో రూ.20వేలు, రూ.10వేలు వరుసగా ప్రథమ, ద్వితీయ, జిల్లా స్థాయిలో రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలను వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి అందజేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ విజేతలకు రూ.లక్ష (ప్రథమ), రూ.50వేలు (ద్వితీయ), రూ.30వేలు (తృతీయ) బహుమతులు అందజేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ విజేతలకు రూ.5లక్షలు (ప్రథమ), రూ.3లక్షలు (ద్వితీయ), రూ.2లక్షలు (తృతీయ) నగదు బహుమతులు అందజేస్తారు.

ప్రణాళికాబద్ధంగా నిర్వహణ



కలెక్టర్ హిమాన్షు శుక్లా పర్యవేక్షణలో ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. అక్టోబర్ 2వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ఈ పోటీల ద్వారా ఉత్తమ క్రీడాకారులు తయారవ్వడమే కాక క్రీడాకారుల్లో ప్రతిభ బయటపడుతుంది.

–పీఎస్ సురేష్‌కుమార్, జిల్లా క్రీడాప్రాథికార సంస్థ, అమలాపురం

వంద కేజీల గంజాయి సీజ్


గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ ఆటోతో అటవీశాఖ సిబ్బంది

గోకవరం: గోకవరం మండలంలోని రామన్నపాలెం గ్రామ శివారున అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఆటోను అటవీశాఖ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఫోక్సుపేట రేంజర్ ఎం.కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం రంపచోడవరం మండలం ఫోక్సుపేట ఠాణా వద్ద అటవీశాఖ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా రంపచోడవరం నుంచి గోకవరం వైపు వస్తున్న ఆటో డ్రైవర్ వీరిని చూసి వేగంగా ముందుకు వెళ్లిపోయాడు. అనుమానం వచ్చిన సిబ్బంది ఆటోను వెంబడించి రామన్నపాలెం శివారున అడ్డుకోగా ఆటో డ్రైవర్ ఆటోను నిలిపి అక్కడి నుంచి మరో వ్యక్తి బైక్‌పై పరారయ్యాడు. ఆటోను సిబ్బంది తనిఖీ చేయగా నాలుగు బస్తాల్లో సుమారు వంద కేజీల గంజాయిని గుర్తించారు. ఆటోను, గంజాయిని సీజ్ చేసి గోకవరం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఈ దాడిలో ఎఫ్‌బీఓలు సుభద్ర, మాణిక్యం, ఠాణాదార్ భువనేశ్వరి, సిబ్బంది తోరాటి రాజేష్, మురళీ పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌తో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదు

- సినిమాలు తీసి అప్పులు తీర్చాలనుకోవడం అమాయకత్వం
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


విలేకరులతో మాట్లాడుతున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్‌ను నాశనం చేస్తున్న బీజేపీతో నడుస్తున్న పవన్ కల్యాణ్.. రాష్ట్రానికి చేసిందేమీ లేదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరంజీవి మంత్రి పదవి కోసం ప్రజా రాజ్యాన్ని కాంగ్రెస్‌కు తాకట్టు పెడితే, తమ్ముడు పవన్ కల్యాణ్ కాపులు, బీసీలు, దళితులను బీజేపీకి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. సినిమాలు తీసి ఆంధ్రప్రదేశ్ అప్పు తీర్చగలనని అనుకోవడం పవన్ కల్యాణ్ అమాయకత్వమన్నారు. వరద బాధితులకు కనీసం రెండు, మూడు నెలలకు సరిపడా నిత్యవసరాలను ప్రభుత్వం అందజేయాలన్నారు. రైతులకు పంట నష్టపరిహారం కింద కనీసం రూ.లక్ష చెల్లించాలని డిమాండ్ చేశారు. తన పార్టీకి అవకాశం ఇస్తే రెండు తెలుగు రాష్ట్రాలకు ఉన్న అప్పులను మూడేళ్లలో తీర్చేస్తానని పాల్ ప్రకటించారు. తనను ఎంపీగా గెలిపించి లోక్‌సభకు పంపితే సత్తా చూపిస్తానని ప్రకటించారు.

ఎరువుల అక్రమ డంపింగ్ గుట్టు రట్టు

- ఐదు మెట్రిక్ టన్నుల అమోనియా సల్ఫేట్ స్వాధీనం
- కేసు నమోదు


అచ్చంపేట ఏడీబీ రోడ్డు పొలాల్లో గుర్తించిన అమోనియా సల్ఫేట్ ఎరువు

సామర్లకోట: కొంతకాలంగా అచ్చంపేట ఏడీబీ రోడ్డు ఉండూరు శివారు మామిళ్లదొడ్డి పుంత రోడ్డులోని పొలాల్లో ఎరువులను అక్రమంగా డంపింగ్ చేసి రవాణా చేస్తున్న గుట్టు రట్టు అయింది. పోర్టు నుంచి ఎరువుల కంపెనీకి వెళ్లవలసిన లోడు వాహనాలను రాత్రి సమయంలో పొలాల్లోకి మళ్లిస్తున్నారు. ఎరువులను 50 కేజీల బ్యాగ్‌లలోకి మారుస్తున్నారు. అయితే వాహనాల డ్రైవర్ల మధ్య వచ్చిన వివాదంతో అక్రమ ఎరువుల డంపింగ్ విషయం బయట పడింది. ఈ మేరకు ఒక వ్యక్తి కాకినాడ ఏడీఏ జీవీ పద్మశ్రీకి బుధవారం సమాచారం ఇచ్చారు. దాంతో పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయాధికారులు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. అచ్చంపేట ఏడీబీ రోడ్డులోని లక్ష్య స్కూల్ ఎదురుగా పుంత రోడ్డులో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న సుబ్బరాజు లే అవుట్‌లో లూజ్ అమోనియా సల్ఫేట్ ఎరువును గుర్తించారు. 50 కేజీల బస్తాల్లో మూటలు 50, మరో 50 కేజీల లూజ్ ఎరువును వ్యవసాయాధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు ఐదు మెట్రిక్ టన్నులు ఉన్న ఎరువుల విలువ రూ.లక్ష ఉంటుందని ఏడీఏ పద్మశ్రీ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల గండేపల్లి, పెద్దాపురం ఏరియాల్లో ఇలాగే ఎరువుల డంపింగ్‌ను గుర్తించామని తెలిపారు. ఈ మేరకు రైతులను, వ్యవసాయ సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు. ఎరువుల అక్రమ నిల్వలు ఉంటే వ్యవసాయశాఖ, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోర్టు నుంచి కంపెనీకి తరలించే సమయంలో ఈ ఎరువులను పొలాల్లోకి తరలించి ఉండవచ్చునని భావిస్తున్నామని తెలిపారు. వ్యవసాయశాఖ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అమోనియా సల్ఫేట్‌ను కేవలం పామాలిన్ తోటలు, కొబ్బరి తోటలకు ఉపయోగిస్తారన్నారు. పొలాల్లోనుంచి వెళ్లిన వాహనాన్ని గుర్తించామని, దాని ఆధారంగా నిందితులను పట్టుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ దాడుల్లో మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, విస్తరణాధికారి ఎంవీ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను కత్తితో బెదిరించిన కేసులో జైలు

కడియం: మండలంలో కడియపులంక వద్ద జాతీయ రహదారిపై కిల్లీ బడ్డీ నిర్వాహకురాలిని కత్తితో బెదిరించి, బంగారం, డబ్బులు దోచుకుపోయిన నిందితులకు బుధవారం ఏడో ఏజీఎంఎఫ్ అదనపు జడ్జి పి.బాబు రెండేళ్ల జైలుశిక్ష, రూ.పదివేల జరిమానా విధించారు. కడియం సీఐ పీవీజీ తిలక్ వివరాలను విలేకరులకు తెలిపారు. 2019వ సంవత్సరంలో జాతీయ రహదారిపై కిల్లీ బడ్డీ నిర్వాహకురాలు పెనుమాక సత్యనారాయణమ్మను అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కత్తితో బెదిరించి, ఆమె మెడలోని బంగారు వస్తువులు, షాపులోని నగదును దోచుకుపోయారు. ఈ కేసులో కాలే మాణిక్యాలరావు, సతీష్, మరొక వ్యక్తి ఉన్నారు. అప్పటి సీఐ బాబూరావు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సతీష్ గతంలోనే నేరం ఒప్పుకుని శిక్షను అనుభవించాడు. మండపేట రూరల్ మండలం ఏడిద గ్రామానికి చెందిన కాలే మాణిక్యాలరావుపై విచారణ పూర్తికావడంతో బుధవారం తీర్పు వెల్లడించారని తిలక్ తెలిపారు. మరో వ్యక్తిపై నేరం నిరూపణ కాలేదన్నారు. ఏపీపీగా ఒ.మహాలక్ష్మి వ్యవహరించారన్నారు. అన్ని సాక్ష్యాలు సకాలంలో ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుల్ గంగాధర్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

నేడు సీఆర్వో కార్యాలయం ప్రారంభం

అన్నవరం: స్థానిక శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం టోల్‌గేట్ వద్ద గల పాత ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం (సీఆర్వో)ను గురువారం సాయంత్రం ప్రారంభిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యాలయంలో సత్రం గదులకు రిజర్వేషన్ చేయడంతో బాటు, రత్నగిరిపై వివిధ సత్రాల గదుల ఖాళీల వివరాలు కూడా భక్తులకు తెలియజేయనున్నట్టు సీఆర్వో సూపరింటెండెంట్ ఐవీ రామారావు తెలిపారు.

రాష్ట్ర విద్యా సదస్సుకు తోటకూర


సాయిరామకృష్ణ

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం విద్యలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి పలువురు ఉన్నతాధికారులు, విద్యారంగ నిష్ణాతులతో ప్రతిష్టాత్మకంగా గురువారం నిర్వహిస్తున్న సదస్సుకు స్థానిక ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ ఎంపిక అయ్యారు. ఈ విషయాన్ని బుధవారం రాత్రి ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. విజయవాడ హోటల్ గేట్‌వేలో సదస్సు జరుగుతుందని ఆయన తెలిపారు. సుపరిపాలన, సాంకేతికతతో కూడిన పాఠశాల విద్యను ఉపయోగించడం ద్వారా జీవన సౌలభ్యాన్ని ప్రోత్సహించడం అనే అంశంపై పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ వర్కుషాపు జరుగుతుందని సాయిరామకృష్ణ తెలిపారు.

ఒకే ఇంటిలో మూడు మోటారు సైకిళ్ల చోరీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెంలో మంగళవారం రాత్రి ఒకే ఇంటిలో మూడు మోటారు సైకిళ్ల చోరీకి గురైనట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ బుధవారం విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన గొల్లవిల్లి సురేష్ ద్రాక్షారామలో వస్త్ర వ్యాపారం నిర్వహిస్తుంటారు. మంగళవారం రాత్రి సురేష్ ఇంటిలోపల పార్కు చేసి ఉన్న మూడు మోటారు సైకిళ్ల(బుల్లెట్, గ్లామర్, ప్లెజర్ వాహనాలను గుర్తు తెలియని దుండగులు దొంగిలించుకుని పోయారు. ఉదయం లేచి చూసేసరికి వాహనాలు కనిపించకపోవడంతో ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినోద్ తెలిపారు.

రొయ్యల వ్యాపారి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం
- తనను ఇద్దరు మోసగించారంటూ సూసైడ్ నోట్


శ్రీనివాస్ (ఫైల్)

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన రొయ్యల వ్యాపారి బాలం శ్రీనివాస్ (47) తన దుకాణంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం సంచలనమైంది. అమలాపురం ఎర్ర వంతెన సమీపంలో గల తన దుకాణంలో ఆ వ్యాపారి మంగళవారం ఆత్మహత్య చేసుకున్న వివరాలను పట్టణ ఎస్సై జి.హరీష్ కుమార్ బుధవారం తెలిపారు. 'వృద్ధాప్యంలో అమ్మను చూడలేక పోతున్నాను. చెల్లెళ్లకు ఏనాడూ ఉపయోగ పడలేకపోయాను. నాకు రూ.కోటి రుణం ఇప్పిస్తామని చెప్పి ఇద్దరు నా నుంచి రూ.40 లక్షలు లాగేసుకున్నారు. రైతుల నుంచి రొయ్యల కొనుగోలు చేయడంతో వారికి బాకీ పడిపోయాను. చేసేది లేక ఆత్మహత్య ఒక్కటే శరణ్యమని నమ్మాను అంటూ రాసిన సూసైడ్ నోటు, చనిపోతున్న దృశ్యాలను చిత్రీకరించిన వీడియో సోషల్ మీడియాలో చూసిన వారు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తనను కొందరు నమ్మించి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని భూమిని కొనిపించి ఆ భూమి మీద రూ.కోటి రుణం ఇప్పిస్తామని పదే పదే ఇబ్బంది పెట్టారని మృతుడు శ్రీనివాస్ వీడియోలో చెప్పారు. తనను మోసం చేసిన వారిని వదలొద్దని వేడుకున్నాడు. అతనికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు యువరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు. సూసైడ్ నోటులో తాను ఎవరెవరికి ఎంత మొత్తం ఇవ్వాలి. తనను ఎవరెవరు నమ్మించి మోసం చేశారో వారి పేర్లను రాశాడని ఎస్సై చెప్పారు. సూసైడ్ నోటును పోలీసు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

మహావృక్షాలకు పునరుజ్జీవం

రోటరీ క్లబ్ సహకారంతో చేపట్టిన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన నగర పాలక సంస్థ కమిషనర్


వృక్షాన్ని తరలించే ప్రక్రియను ప్రారంభిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజానగరం: పెరిగిన చెట్లను నరికేయడం సులువే కానీ వాటిని పెంచాలంటేనే సంవత్సరాలు పడతాయి. ఆ విధంగా సంవత్సరాల తరబడి ఎదిగిన చెట్లను తప్పనిసరి పరిస్థితులలో తొలగించవలసి వస్తే .. ఇంతకాలం ఆ విధంగా ఎన్నో మహావృక్షాలు నెలకొరిగాయి. అయితే ఇకపై అటువంటి పరిస్థితులు లేకుండా ఏళ్ల తరబడి పెరిగిన మహావృక్షాలను తొలగించవలసి వస్తే, వాటికి పునర్జీవం పోస్తామంటున్నారు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ సభ్యులు. ఇందులో భాగంగానే రాజానగరం – కాకినాడ ఏడీబీ రోడ్డు విస్తరణలో భాగంగా తొలగిస్తున్న మహావృక్షాలను వేరొక ప్రాంతానికి తరలించి, పునరుజ్జీవం ఇచ్చే కార్యక్రమానికి రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణకుగాను కొన్నిచోట్ల పెద్దపెద్ద వృక్షాలను తొలగించవలసి వస్తుందన్నారు. వాటిని ఆ ప్రాంతం నుంచి తొలగించినప్పటికీ సురక్షితంగా వేరొక ప్రాంతానికి తరలించి అక్కడ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడానికి రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ సభ్యులు ముందుకు రావడం హర్షణీయమన్నారు. దీనివలన ఏళ్ల తరబడి పెరిగిన చెట్లను కాపాడుకోవడంతోపాటు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి తోడ్పడుతుందన్నారు. రాజానగరం ఏడీబీ రోడ్డులోని 'సాక్షి' ముద్రణా కార్యాలయానికి ఎదురుగా ఉన్న సుమారు 60 సంవత్సరాలు పైబడిన మర్రిచెట్టును రాజమహేంద్రవరానికి తరలించే ప్రక్రియకు బుధవారం శ్రీకారం చుట్టామన్నారు. ఈ చెట్టును రాజమహేంద్రవరం నగరంలో ప్రజలందరికీ తెలియజేయడంతోపాటు స్ఫూర్తినిచ్చే విధంగా నాటుతామన్నారు. కాగా ఈ చెట్టును ఇక్కడ నుంచి తరలించి, ప్లాంటేషన్ చేసే ప్రక్రియకు సుమారు 45 రోజులు సమయం పడుతుందన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు తీగెల రాజా మాట్లాడుతూ ఈ వృక్షం తరలింపునకు సుమారు రూ.లక్ష అవుతుందన్నారు మహావృక్షాల తరలింపు కార్యక్రమాన్ని తమ సభ్యుల సహకారంతో నిర్విరామంగా కొనసాగిస్తామన్నారు. బ్రేక్ ఇనస్పెక్టర్ సంపత్, డీఎఫ్ఓ నాగరాజు, రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు వెంకన్నబాబు, ప్రోగ్రామ్ చైర్మన్ దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీ కె.జాన్, రోటరీ క్లబ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

దెయ్యం పట్టుకుందని భార్యను చితకబాదిన భర్త

- చికిత్స పొందుతూ మృతి
- హత్య కేసుగా నమోదు


మృతి చెందిన మనీషా (ఫైల్)

రాజోలు: పట్టుకున్న దెయ్యాన్ని వదిలిస్తానంటూ భార్యను చెప్పుతో విచక్షణారహితంగా చితకబాదడంతో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై బుధవారం రాజోలు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. రాజోలు ఎస్సై పృధ్వీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలు మండలం శివకోడు కందికట్టు వారి గ్రూపునకు చెందిన బళ్ల విజయ్‌కుమార్‌కు 2015లో అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన మనీషాతో వివాహమైంది. వారికి మూడేళ్ల కిరిటీ సాయి వర్ధన్, ఏడాదిన్నర హర్ష ఉన్నారు. కొంత కాలంగా భార్యపై అనుమానంతో భర్త విజయ్‌కుమార్ చీటికిమాటికీ గొడవ పడుతున్నాడు. మనీషా తల్లి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లడంతో తరచూ డబ్బులు పంపించాలని వేధించేవాడు. ఈ పరిస్థితుల్లో గత నెల 28వ తేదీన మనీషాకు దెయ్యం పట్టుకుందని చెప్పుతో చితకబాది, మెడను తిప్పడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ఆ స్థితిలో ఉన్న ఫొటోలను విజయ్‌కుమార్ మనీషా తండ్రి శ్రీనివాసరావుకు పంపించాడు. వెంటనే ఆయన తన కుమారుడు కార్తీక్‌తో శివకోడు వచ్చి మనీషాను వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకుని వెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం గత నెల 31వ తేదీన అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తీసుకుని వెళ్లగా ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే దెయ్యం పట్టుకోవడంతో అనారోగ్యానికి గురై, తన భార్య చనిపోయిందని నమ్మించి మృతదేహాన్ని తన ఇంటికి భర్త విజయ్‌కుమార్ తీసుకుని వచ్చాడు. కువైట్‌లో ఉన్న మనీషా తల్లి వచ్చిన తర్వాత అంత్యక్రియలు చేయాలని మనీషా తండ్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశాడు. కుమార్తె మృతి చెందిందన్న విషయం తెలియగానే తల్లి కువైట్ నుంచి బుధవారం శివకోడు వచ్చి తన కుమార్తె అనారోగ్యంతో చనిపోలేదని, దెయ్యం పట్టుకుందని అబద్ధాలతో తన అల్లుడే చంపేశాడని భోరున విలపించింది. తన కుమార్తె మృతిపై విచారణ చేయాలని తండ్రి శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదు మేరకు రాజోలు ఎస్సై పృధ్వీ కేసు నమోదు చేశారు. పి.గన్నవరం సీఐ రజనీకుమార్ దర్యాప్తు చేపట్టారు. తహసీల్దారు బి.ఎం.ముక్తేశ్వరరావు ఘటనా స్థలంలో విచారణ నిర్వహించారు. మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టమ్‌కు తరలించామని, భర్త విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని ఎస్సై పృధ్వీ తెలిపారు.